## క్లుప్తంగా

### మహిళను దూషించిన యువకుడిపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటికి వచ్చి మహిళను దూషించడమే కాకుండా చంపుతానని బెదిరింపులకు పాల్పడిన యువకుడిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీలో కొల్లిపాక రమణ, తలుపులు దంపతులు నివాసం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో రాజశేఖర్ అనే యువకుడు రమణ ఇంటికి వచ్చి మీ అల్లుడు ఉన్నాడా అని ఆరా తీశాడు. అల్లుడు ఇక్కడ లేడని చెప్పడంతో రాజశేఖర్ కోపంతో ఊగిపోతూ నీ కూతురిని వాడికి ఇచ్చి పెళ్లి చేశావు కదా వాడిని చంపేస్తానని బెదిరింపులకు పాల్పడటమే కాకుండా ఇంటి ముందు ఉన్న టిఫిన్ బండిని పడేశాడు. అంతే కాకుండా నోటికి వచ్చినట్లు దూషించడంతో ఆందోళన చెందిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకుడు రామరత్నమాచార్యులు పంచామృతాలతో అభిషేకాలు, అర్చన నిర్వహించారు. స్వామి వారి అభిషేకాలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు తరలివచ్చారు. అనంతరం మూలవిరాట్‌కు తులసీ దళాలతో అర్చన, పంచహారతుల సేవ నిర్వహించారు.

### ప్రధాన డ్రైన్లలో పూడికతీత పనులు ప్రారంభం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని ప్రధాన డ్రైన్లలో ఐదు లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన పూడిక తీత పనులను గురువారం ప్రారంభించారు. సుబ్బరామయ్య వీధి తదితర వీధుల్లో పనులను స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు, ఇతర అధికారులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పాజీరావు మాట్లాడుతూ ప్రజలు కాలువల్లో చెత్త వేయవద్దని, పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని కోరారు. నగర పరిశుభ్రతకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏతు శ్రీనివాసరావు, స్థానిక ప్రముఖులు పడాల రాజేష్, రెహమాన్, నల్లబిల్లి మోహన్, ముదిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### అదానీ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలి



కృష్ణలంక(విజయవాడతూర్పు): సెకి–అదానీ ఒప్పందాన్ని వ్యతిరేకించి కోర్టులో కేసు వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక మంత్రి అదానీ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని, రైతులకు లాభం చేకూర్చే విధంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తిని వికేంద్రీకరించాలని, నెట్ మీటరింగ్ వేసి రైతుల భూముల్లో విద్యుత్ ఉత్పత్తి చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో సెకి–అదానీ ఒప్పందాలపై సెంటర్ ఫర్ లిబర్టీ ఆధ్వర్యంలో గురువారం ఆల్ పార్టీ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ సెకి–అదానీ ఒప్పందంపై సీఎం చంద్రబాబు గతంలో శ్వేతపత్రం విడుదల చేశారని, ఒప్పందం మూలంగా ప్రజలపై రూ.లక్ష 20వేల కోట్లు భారం పడుతుందన్నారు. స్మార్ట్ మీటర్ల వలన అపార నష్టం జరుగుతుందని, వీటిని కూడా అదానీ కంపెనీ సరఫరా చేస్తుందన్నారు. రూ.40 కోట్లను ఎలెక్టోరల్ బాండ్స్ రూపంలో షిరిడి సాయి కంపెనీ టీడీపీకి ఇచ్చిందని, ఇది కేవలం తెల్లధనం మాత్రమే, మరి నల్లధనం ఎంత ఇచ్చి ఉంటుందో ఊహించవచ్చన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రమేష్ మాట్లాడుతూ అదానీ విద్యుత్ ఒప్పందాలపై అవినీతి ఆరోపణల నిగ్గు తేల్చడానికి వెంటనే ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయాలని, సిట్ నియమించి సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మెగా విద్యుత్ ఒప్పందాలు, భారీ సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లో ఒప్పందాలు చేసుకోకూడదన్నారు. కాంగ్రెస్ నాయకుడు కె.శివాజీ, జనచైతన్య వేదిక నాయకుడు లక్ష్మణరెడ్డి, పౌరసంఘం నాయకులు భవానీప్రసాద్, లక్ష్మీనారాయణ, ఐద్వా కార్యదర్శి రమాదేవి తదితరులు మాట్లాడారు.

# ద్వీపంలో లేజర్ షో మూన్నాళ్ల ముచ్చట

- 2017లో చంద్రబాబు శంకుస్థాపన
- తరువాత వరదలో కొట్టుకుపోయిన వైనం
- నాటి నుంచి నేటి వరకు పునరుద్ధరణ చర్యలు శూన్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ భవానీ ద్వీపంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన మ్యూజికల్ లేజర్ షో కనుమరుగైంది. గతంలో లేజర్ షో ఉండేదనటానికి అక్కడక్కడ ఆనవాళ్లు మాత్రం కనిపిస్తున్నాయి. పర్యాటక శాఖలో భాగమైన భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) ఆధ్వర్యంలో రూ.16 కోట్ల వ్యయంతో 'మల్టీమీడియా లేజర్ షో మ్యూజికల్ డ్యాన్సింగ్ ఫౌంటెన్' ఏర్పాటుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు 2017 డిసెంబర్‌లో శంకుస్థాపన చేశారు. ఇందుకోసం లేజర్ షో ప్రదర్శించేందుకు ఒక ప్రొజెక్టర్, పవర్ రూమ్, దాని పక్కనే నదీతీరాన కూర్చుని వీక్షించేందుకు గ్యాలరీ నిర్మించారు. కోల్‌కతాకు చెందిన ప్రీమియర్ వరల్డ్ లేజర్ షో ఫౌంటెన్ పనులను చేపట్టి సుమారు 6 నెలల కాల వ్యవధిలో పూర్తి చేసింది. అనంతరం లేజర్ షో ద్వారా పర్యాటకులకు మైమరిపించే విధంగా అద్భుతాలను చూపించారు. కూచిపూడి నృత్యాంశాలకు సంబంధించి కళాకారిణులు నర్తించిన దృశ్యాలు, వివిధ ఆకృతులలో లేజర్ కిరణాల దృశ్యాలు వంటి అనేక కళాత్మక రూపాలను ఆవిష్కరింప చేసి పర్యాటకులతో అద్భుతః అనిపించారు. విజయవాడ వాసులకు సుమారు ఒక ఏడాది కాలం మాత్రమే ఈ అద్భుత ప్రదర్శనలను చూసే భాగ్యం కలిగింది. 2019లో వచ్చిన వరదలకులేజర్ షో మ్యూజికల్ డ్యాన్సింగ్ ఫౌంటెన్ కొట్టుకుపోయి పరికరాలన్నీ దెబ్బతిన్నాయి. దీంతో లేజర్ షో మూన్నాళ్ల ముచ్చటే అయింది.



నాటి లేజర్ షో దృశ్యాలు (ఫైల్)

**లేజర్ షో పునరుద్ధరణ చర్యలు శూన్యం**

పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన లేజర్ షో పరికరాలు వరదలో కొట్టుకుపోయిన తరువాత దాని పునరుద్ధరణకు సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కనీసం దాని గురించి చర్చించిన దాఖలాలు కూడా శూన్యం. పర్యాటక శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, ఉదాసీనతే అందుకు కారణమని సమాచారం. తమకు నెల నెలా జీతాలు వస్తున్నాయా లేదా అన్నదే తప్ప అన్నం పెట్టే సంస్థకు ఆదాయాన్ని ఒనగూర్చే ఆలోచనే అధికారులలో ఏమాత్రం లేదన్నది సుస్పష్టం. కనీసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పునరుద్ధరిద్దామన్న సదుద్దేశం కూడా వారిలో ఏ కోశానా లేదని ఐలాండ్ సిబ్బంది మండిపడుతున్నారు. మరో వైపు చూస్తే లేజర్ షో ఏర్పాటు చేసిన ప్రీమియర్ వరల్డ్ ప్రైవేట్ సంస్థకు పర్యాటక శాఖ చెల్లించాల్సిన మొత్తంలో కొంత బకాయి ఉందని, అందుకే ఆ సంస్థ నిర్వాహకులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యాటక శాఖ ఎండీలు, చైర్మన్లు మారుతున్నారు కాని లేజర్ షో పునరుద్ధరణపై మాత్రం ఏ ఒక్కరూ దృష్టి సారించకపోవడం గమనార్హం. వరదలో నదిలోకి కొట్టుకుపోయిన లేజర్ షో పరికరాలను (మోటర్లు, తదితరాలు) వెలికితీసే బాధ్యతను టెండర్లు పిలవకుండానే ద్వీపంలోని ఒక సివిల్ ఇంజినీర్‌కు అప్పగించారని, అందుకు అతని పేరుపై రూ.5 లక్షల చెక్కును ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.



నాడు చంద్రబాబు శంకుస్థాపన చేసిన లేజర్ షో శిలాఫలకం

## జాతీయ పోటీల్లో సత్తా చాటిన నలంద చిన్నారులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మాదల పద్మజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): పంజాబ్‌లోని మొహాలీలో ఈ నెల 10వ తేదీన ప్రారంభమైన జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో నలంద విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీల్లో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 2400 మంది విద్యార్థులు పాల్గొనగా నలంద విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. సెకండ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ షిప్ అండర్ –14 విభాగంలో ఎం.మోక్షిత్‌రెడ్డి, ఎం.గోపాల్‌కౌషిక్, వి.కిరణ్‌కుమార్, ఎస్‌వై శరణ్, వి.శ్రీమాన్‌రిషి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఇన్‌లైన్ హాకీ జూనియర్స్ అండర్ –17 విభాగంలో ఏవీ జితేష్, కామినేని కార్తీక్, ఎం.మోక్షిత్ రెడ్డి, ఎస్‌వీ హేమంత్, కోడి శశికర్, సి.చేతన్‌సాయి రెడ్డి, చరిత్ శ్రీ వెంకట్, వెంకట బాంధవ్ తృతీయ స్థానం పొందినట్లు తెలిపారు. దక్షిణ కొరియాలో జూలైలో జరిగే హాకీ అండర్ 10 బృందం సెలక్షన్స్‌లో ఇండియా మొత్తం మీద 75 మంది ఎంపిక కాగా, వారిలో శ్రీ కార్తీక్ 5వ స్థానంలో నిలిచినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులు, కోచ్ ఆనంద్‌ను గురువారం ప్రిన్సిపాల్ మాదల పద్మజ అభినందించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం గర్వకారణంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఎంతమందికి లైసెన్సులు ఇచ్చారు?

- పూర్తి వివరాలను మా ముందుంచండి
- విజయవాడ మునిసిపల్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: విజయవాడ నగరంలో రోడ్లలో ముఖ్యంగా బీసెంట్ రోడ్డును ఆక్రమించుకుని ఎంతమంది వీధి వ్యాపారులు వ్యాపారం చేస్తున్నారు? ఎంత మందికి అనుమతులిచ్చారు? ఎంతమంది అనుమతులు లేకుండా వ్యాపారం చేస్తున్నారు? తదితర వివరాలను తమ ముందుంచాలని విజయవాడ మునిసిపల్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. ప్రతి జోన్‌లో ఎంత మంది వీధి వ్యాపారులకు లైసెన్సులు మంజూరు చేశారు? రోజుకు ఎన్ని గంటలు, ఏ సమయంలో వారు అమ్మకాలు జరుపుకొనేందుకు అనుమతించారో కూడా చెప్పాలని స్పష్టం చేసింది. వీధి వ్యాపారుల విషయంలో నిర్దిష్ట ప్రణాళికతో కూడిన కార్యాచరణను తమ ముందుంచాలని తేల్చి చెప్పింది. తదుపరి విచారణను జూలై 16కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బీసెంట్ రోడ్డులో వీధి వ్యాపారులు రోడ్డు మొత్తాన్ని ఆక్రమించేశారని, దీని వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బాధ్యులపై చర్యలు తీసుకునేలా విజయవాడ మునిసిపల్ అధికారులను ఆదేశించాలని కోరుతూ బీసెంట్ రోడ్ బిల్డింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.వెంకట విజయప్రసాద్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది దొడ్డక హర్షవర్ధన్ వాదనలు వినిపిస్తూ, వీధి వ్యాపారుల వల్ల ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు మొత్తం ఆక్రమించడం వల్ల అత్యవసర సేవల వాహనాల రాకపోకలు కూడా సాధ్యం కావడం లేదన్నారు. వైద్యపరంగా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు అంబులెన్స్‌లు వెళ్లే పరిస్థితి కూడా లేదని తెలిపారు. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ తరఫు న్యాయవాది ఏఎస్‌సీ బోస్ వాదనలు వినిపిస్తూ, విజయవాడలో పలు జోన్లు ఏర్పాటు చేసి వ్యాపారాల నిమిత్తం వీధి వ్యాపారులకు లైసెన్సులు జారీ చేశామన్నారు. గ్రీన్‌జోన్‌లో ఎవరైనా వ్యాపారం చేసుకోవచ్చునని, అంబర్ జోన్‌లో లైసెన్స్ ఉన్న వారికి మాత్రమే అనుమతి ఉంటుందని, రెడ్‌జోన్‌లో వీధి వ్యాపారులకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. బీసెంట్ రోడ్‌లో అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తున్న 150 మందికి నోటీసులు ఇచ్చామన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. వాదనలు విన్న ధర్మాసనం, వీధి వ్యాపారులు వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతినిచ్చిన ప్రాంతాలను వ్యక్తిగతంగా పరిశీలించి పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించింది.

## రైల్వే హాస్పిటల్‌కు ఫిజియోథెరపీ యంత్రం బహూకరణ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ అధ్యక్షురాలు డాక్టర్ వర్షా పాటిల్ ఆధ్వర్యంలో రైల్వే హాస్పిటల్‌కు రూ.4.5 లక్షల విలువ చేసే అత్యాధునిక ఫిజియోథెరపీ యంత్రం–ఇంటెలెక్ట్ మొబైల్ కాంబోను బహూకరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ వర్షా పాటిల్ మాట్లాడుతూ రైల్వే హాస్పిటల్‌లో ప్రతి రోజు 60 మంది వరకు ఫిజియోథెరపీ రోగులకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స అనంతరం రోగులకు ఫిజియోథెరపీ ముఖ్యమైన ప్రక్రియ అన్నారు. రోగులు సకాలంలో కోలుకునేందుకు తమ అసోసియేషన్ అధునాతన ఫిజియోథెరపీని హాస్పిటల్‌కు అందజేసినట్లు తెలిపారు. ఈ యూనిట్ ద్వారా ఇంటర్‌ఫరెన్షియల్ థెరపీ (ఐఎఫ్‌టి), ట్రాన్స్‌క్యుటేనియస్ ఎలక్ట్రికల్ నెర్వ్‌స్టిమ్యులేషన్ (టీఈఎన్‌ఎస్)తో పాటు ఇతర నొప్పుల నివారణకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ శ్రీనివాసు మాట్లాడుతూ హాస్పిటల్‌లో ప్రతి ఏడు 300 మేజర్, 750 మైనర్ సర్జరీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్జరీ అనంతరం రోగులు త్వరితగతిన కోలుకోవడానికి ఈ ఫిజియోథెరపీ యూనిట్ ఎంతగానో ఉపయోగపడుతుందని, వాటిని అందజేసిన ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జీఎండీ చారి, ఫిజియోథెరపిస్టు డాక్టర్ కె.ప్రభావతి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



రైల్వే హాస్పిటల్‌కు ఫిజియోథెరపీ యూనిట్‌ను అందజేసిన డాక్టర్ వర్షా పాటిల్

### ఫిజియో థెరపిస్టులకు గుర్తింపుపై హర్షం



లబ్బీపేట(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం ఫిజియోథెరపీ విద్యకు తగిన గుర్తింపు ఇవ్వడం పట్ల నగరంలోని పలువురు ఫిజియోథెరపిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నగరంలోని స్టార్ ఫిజియో థెరపీ సెంటర్‌లో కేక్ కట్ చేశారు. అనంతరం డాక్టర్ ప్రభుదాస్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ అడ్మిషన్లు ఇక నుంచి నీట్ ద్వారా చేపట్టడంతో పాటు, కోర్సులు ఐదేళ్లకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. అంతేకాకుండా ఫిజియోథెరపీ కోర్సు పూర్తి చేసిన వారు పేరు ముందు డాక్టర్ అని పెట్టుకునేలా ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. ఇది మంచి పరిణామం అని, ఇప్పటి వరకూ సరైన గుర్తింపు లేని ఫిజియోథెరపీకి, తగిన గుర్తింపు, గౌరవం లభించినట్లు అయిందన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టులు డాక్టర్ చైతన్యరెడ్డి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ ఘంటా కుమార్, డాక్టర్ రత్నకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### 27న గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సదస్సు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యురాలు కె.స్వరూపరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థలు–గ్రంథాలయాలు, సాంకేతిక యుగం–పుస్తక పఠనావశ్యకత, పౌర గ్రంథాలయాలు–సమస్యలు–పునర్నిర్మాణం, పౌర గ్రంథాలయాలు–సాహిత్యం –ప్రాధాన్యత అనే అంశాలపై నాలుగు విభాగాలుగా సదస్సు జరుగుతుందన్నారు. మరుగున పడుతున్న మాతృభాషను పరిరక్షించాలని, విద్యార్థులకు, పరిశోధకులకు, ప్రజలకు సమాచార వనరులను అందించాలని, గ్రంథాలయ నాణ్యతా పనితీరును మెరుగుపరిచి ఉద్యోగ నియామకాలు జరపాలని, ప్రజల నుంచి వసూలు చేసిన గ్రంథాలయ సెస్సును గ్రంథాలయ అభివృద్ధికి ఉపయోగించాలని కోరుతూ ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితలు, కవులు, ప్రచురణ కర్తలు, ఉపాధ్యాయులు, కళాకారులు, మేధావుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే సదస్సులో విజ్ఞాన కేంద్రాల బాధ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## కృష్ణా మిల్క్ యూనియన్‌పై అసత్య ప్రచారాలను సహించం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ పైన, చైర్మన్ చలసాని ఆంజనేయులుపైన కొన్ని సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న అసత్య ప్రచారాలను సహించబోమని బోర్డు డైరెక్టర్లు హెచ్చరించారు. కృష్ణా మిల్క్ యూనియన్ పరిపాలనా భవనంలోని బోర్డు మీటింగ్ హాల్‌లో గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చలసాని ఆంజనేయులు, బోర్డు డైరెక్టర్లు మీడియాతో మాట్లాడారు. గత కొంత కాలంగా తనతో పాటు మిల్క్ యూనియన్‌పై సామాజిక మాధ్యమాలలో దుష్ప్రచారం చేస్తున్నారని, తమ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పెడుతున్న పోస్టులు సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. పాడి రైతులకు అండగా ఉంటున్న కృష్ణా మిల్క్ యూనియన్‌పై ద్వేషంతో కొంతమంది గిట్టని వారు చేస్తున్న ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తనకు అన్యాయం జరిగిందని చెబుతున్న మహిళ అజ్ఞాతం వీడి తమ ముందుకు వస్తే న్యాయం చేస్తామని బోర్డు డైరెక్టర్లు చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న అసత్య ప్రచారాలపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని, దీనిపై న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధమన్నారు. సమావేశంలో బోర్డు డైరెక్టర్లు దాసరి బాలవర్ధనరావు, వేమూరి సాయి వెంకట రమణ, అర్జా వెంకట నగేష్, పల్లగాని కొండలరావు, బొట్టు రామచంద్రరావు, నెలకుదిటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న చైర్మన్, బోర్డు డైరెక్టర్లు

## డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితి పెంచాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయులకు ఈవెంట్స్‌కు వెయిటేజ్ మార్కులు కలపాలని, అలాగే అభ్యర్థుల వయో పరిమితి 47 ఏళ్లకు పెంచాలని ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వయోపరిమితి పెంచాలని కోరుతూ గురువారం విజయవాడ అలంకార్ సెంటరు ధర్నా చౌక్ వద్ద అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య, రాజేంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేంద్రలు మాట్లాడుతూ డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయులకు సర్టిఫికెట్స్, ఈవెంట్స్‌కు 30శాతం వెయిటేజ్ మార్కులు కలపాలని కోరారు. రాష్ట్రంలో 30 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారని, తీరా చూస్తే కేవలం 16,347 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషల్ డీఎస్సీపై రాష్ట్ర ప్రభుత్వం ఊసే ఎత్తడం లేదన్నారు. పీఈటీ పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు పది, ఇంటర్‌లో 50 శాతం పాస్ పర్సంటేజ్ ఉండాలనే నిబంధన కారణంగా వేలాదిమంది అభ్యర్థులు నష్టపోతున్నారని చెప్పారు. ఈ నిబంధనను సరళించాలన్నారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షలు ఏకకాలంలో షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని, తేదీలను మార్చాలని కోరారు. ధర్నాలో నాయకులు లంకా గోవిందరాజులు, నరసింహులు, వెంకటేశ్వర్లు, మధు, చెల్లయ్య, వెంకట్, సుధాకర్, గంటా మమత తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐవైఎఫ్, వ్యాయామ ఉపాధ్యాయ అభ్యర్థులు

## బహుభాషా గాయని ఎస్.జానకి

విజయవాడ కల్చరల్: బహుభాషా గాయని ఎస్.జానకి అని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. ఆశీష్ స్టూడియోస్, రాగలహరి, విజయశాంతి యువసేన ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గురువారం సినీ సంగీత విభావరి, వైజయంతి పురస్కారం ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో జానకి పాడిన పాటలు చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. 60 ఏళ్లుగా ఆమె పాటలు పాడుతూనే ఉన్నారన్నారు. అనంతరం ఆశీష్ స్టూడియో నిర్వాహకురాలు సత్య స్వాతి, యువ గాయకుడు సూర్యను వైజయంతి పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రభల శ్రీనివాస్, చింతకాయల చిట్టిబాబు, కే డేవిడ్‌రాజు పాల్గొన్నారు. గాయనీ గాయకులు జానకి పాడిన పాటలను ఆలపించారు.



సత్యస్వాతి, సూర్యకు వైజయంతి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

## టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం అన్నప్రసాద వితరణ జరిగింది. శ్రీవారి అన్నప్రసాదం భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి పర్యవేక్షణలో రాజులపాటి రాంబాబు లీలావతి, వేంకటరామన్, కిరణ్‌కుమార్ సహకారంతో మూడు వందల మందికి అన్నప్రసాదం అందించారు. ముందుగా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొనేవారు కల్యాణ మండపంలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

# విధులు బహిష్కరించిన న్యాయవాదులు



విజయవాడలీగల్: పెహల్గామ్‌లో పర్యాటకులను దారుణంగా కాల్చి చంపడాన్ని నిరసిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. పెహల్గామ్‌లో పర్యాటకులపై నరమేధం సృష్టించిన ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బెజవాడ బార్ న్యాయవాదులు ఉదయం విధులను బహిష్కరించారు. సాయంత్రం దాడిలో మరణించిన వారికి సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలుపుతూ కోర్టు కాంప్లెక్స్ నుంచి బందరురోడ్డు వరకు న్యాయవాదులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులు మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు దేశ సమగ్రతను, సమైక్యతను దెబ్బతీయలేవన్నారు. దేశపౌరులు ఇటువంటి ఘటనలతో మనోధైర్యాన్ని కోల్పోకుండా మరింత జాగురూకతతో ఉండాలని కోరారు. ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టేలా నరమేధం సృష్టించిన ఘటనలను తిప్పికొడతామన్నారు. ఇలాంటి దుశ్చర్యల వలన హిందూ ముస్లింల ఐక్యతకు ఎలాంటి భంగం వాటిల్లదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా, గవర్నింగ్ బాడీ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదుల దాడి అత్యంత కిరాతకం



చిట్టూరి కాంప్లెక్స్ వద్ద క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి అత్యంత కిరాతకమని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో పాతబస్తీలోని చిట్టూరి కాంప్లెక్స్ సెంటర్, ఖాదర్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ క్యాండిల్ ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ అందమైన జమ్మూ కశ్మీర్ ప్రాంతానికి ఆహ్లాదకర వాతావరణం కోసం వెళ్లిన టూరిస్టులు ఆనందోత్సాహాల్లో ఉన్న సమయంలో ఉగ్రవాద మూకలు 28 మంది అమాయక ప్రజలను అత్యంత కిరాతకంగా హత్యగావించడం హేయమైన చర్య అన్నారు. ఈ ఘటనలను ఆసరాగా చేసుకుని మానవత్వం పెంచవలసిన తరుణంలో మతోన్మాదాన్ని పెంచుతూ దేశ ప్రజల ఐక్యతకు విఘాతం కల్పిస్తున్నారని తెలిపారు. దేశంలో అమాయక ప్రజలను ఉగ్రవాదం పేరుతో, మతోన్మాదం పేరుతో హత్యలు గావిస్తూ దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారన్నారు. ఉగ్రవాదులు కశ్మీర్ ప్రాంతానికి ఎలా ప్రవేశించారు, ఎవరి ఆదేశాలతో ఈ హత్యాకాండకు పాల్పడ్డారనేది సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ఈ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద శక్తులతో లాలూచీ పడకుండా దేశ ప్రజలందరి ఐక్యతను పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.ఆదిలక్ష్మి, నాయకులు ఈవీ నారాయణ, నగర కమిటీ సభ్యులు ఎం.కొండారెడ్డి, ఈ.రాజు, కె.వెంకటరత్నం, జి.సుబ్బారెడ్డి, షాకిరా, ఎం.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఒకటి నుంచి యోగ, బ్యాడ్మింటన్, ఏరోబిక్స్ శిక్షణ

విజయవాడస్పోర్ట్స్: పీబీ సిద్ధార్థ కాలేజీలో వచ్చేనెల ఒకటో తేదీ నుంచి యోగాసన, బ్యాడ్మింటన్, ఏరోబిక్స్ ఫిట్‌నెస్‌లో వేసవి శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 31వ తేదీ వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని, అన్ని వయసుల వారు శిక్షణలో పాల్గొనవచ్చని చెప్పారు. ఏరోబిక్స్ శిక్షణకు హాజరయ్యే వారు మెడికల్ సర్టిఫికెట్‌తో రావాలని తెలిపారు. దరఖాస్తులను కాలేజీలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో పొందాలని, మరిన్ని వివరాలకు కాలేజీ వ్యాయామవిద్యా అధ్యాపకుడు కృష్ణారెడ్డి(99639 92102)ను సంప్రదించాలని సూచించారు.